క్లుప్తంగా

గ్రామ దేవతలకు పూజలు



పుట్ట పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్టపెద్దమ్మకు అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. స్థానిక అమ్మవారిలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్‌నగర్ గ్రామ సమీపాన వెలసిన సుంకులా పమేశ్వరీకి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

8 నుంచి బస్ పాసుల జారీ

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో స్టూడెంట్, సీజన్ పాసులు ఈ నెల 8వ తేదీ నుంచి జారీ చేస్తామని డీఎం తిరుపతయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్‌పాసుల జారీకి సంబంధించి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేపడుతుండటంతో జాప్యం అవుతుందన్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో ఇవ్వాల్సిన బస్‌పాసులు కాస్త ఆలస్యమవుతాయని విద్యార్థులు, సీజన్ పాసుదారులు గమనించాలని సూచించారు.

డోన్ టౌన్ : బస్ పాస్‌ల జారీ ఈ నెల 8వ తేదీ నుంచి కొనసాగిస్తున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ వర్షన్ అప్‌డేట్ చేస్తున్నందున ఈ నెల 6,7వ తేదీల్లో బస్ పాస్ కౌంటర్ పనిచేయవన్నారు.

మానవత్వం చాటుకున్న ఏఎన్‌ఎంలు



నగదు అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

మహానంది: నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ సాయిబాబా గుడి వీధిలో నివాసముంటున్న వాల్మీకి గుత్తికావలి జ్యోతికి ఇటీవల ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆమె చికిత్సకు సహాయ, సహకారాలు అందించాలని సోషల్ మీడియాలో వచ్చిన సందేశానికి బండిఆత్మకూరు మండలం నారాయణాపురం ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్పందించారు. ఏఎన్‌ఎంలు వీరమ్మ, బాల హుసేనమ్మ, పద్మావతి మంగళవారం తమ వంతుగా రూ.6వేలు సహాయం అందించారు.

కాళికాంబకు అష్టాదళ పాదపద్మారాధన



అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి, వివిధ రకాల పూలతో పూలంగి సేవ కార్యక్రమం జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

‘పశుగ్రాసం’ ఎంపిక కీలకం!

- మేలైన గడ్డి సాగుకు ఖరీఫ్ సీజన్ అనుకూలం
- పశువుల ఉత్పాదక, ఆరోగ్యానికి దోహదం

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగంలో సాంకేతిక మార్పుల మూలంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దీంతో పశుపోషణ రైతన్నకు భారంగా మారుతోంది. పశుగ్రాసం పెంపకానికి ఖరీఫ్ సీజన్ అనుకూలం అంటున్నారు వ్యయసాయ అధికారులు. అయితే గ్రాసం ఎంపిక కీలకమని పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అనుకూలంగా మారడంతో పశుపోషణలో పశుగ్రాసాల పాత్ర ముఖ్యమైందన్నారు. పశువు ఉత్పాదక ఎక్కువగా, ఆరోగ్యంగా ఉండటానికి, పశుపోషణ వ్యయం తగ్గించడానికి వివిధ రకాల పశుగ్రాసాలు దోహద పడుతాయి. రైతులు తమకున్న వనరుల్లో కొంత భూమిని కేటాయించి వివిధ రకాల పశుగ్రాసాలను సాగు చేసుకోవడం మంచిది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తుంది. పసుగ్రాసానికి సంబంధించి వివిధ రకాల సాగు వివరాలను పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు.



గుళ్లదూర్తి సమీపంలో పారాగడ్డి సాగు చేసిన దృశ్యం

మొక్కజొన్న పశుగ్రాసాలు

సాగునీటి వనరులను బట్టి పశుగ్రాసాలను ఎంపిక చేసుకోవాలి. వర్షాధారంగా సాగు చేయడానికి ఆఫ్రికన్ టాల్‌వంటి పంట అనుకూలం. దీనిని 70–80 రోజుల్లో కోసి గ్రాసంగా వాడుకోవచ్చు. అయితే ఒక కోత మాత్రమే పొందగలం. ఎకరాకు 16–20 టన్నుల నాణ్యమైన గ్రాసం వస్తుంది. పలు కోతలనిచ్చే గింజజాతి ఎంపిచారి, పిపిచారి, ఎస్ఎస్‌జీ 59–3, ఎస్ఎస్‌జీ–898 వంటి గడ్డిజాతి రకాలు 55–60 రోజులకు మొదటి కోతనిస్తాయి. తర్వాత ప్రతి 30రోజులకు ఒక కోత చొప్పున ప్రతి కోతకు 20 టన్నుల పశుగ్రాసం వస్తుంది. ఎకరాకు 16 కిలోల విత్తనం అవసరమవుతుంది. ప్రతి కోత తర్వాత 50 కిలోల యూరియా పొలంలో వేయాలి.

సజ్జ : ఈ గ్రాసాల్లో జైంటో, రాజ్‌కో 5–130, జే–55, కే–533 వంటి రకాలు సాగునీటి సౌకర్యం ఉన్న అన్ని రకాల భూముల్లో సాగుకు అనుకూలం. వర్షాధార పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరాకు దుక్కిలోకి 5 టన్నుల పశువుల ఎరువు, 44 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 22 కిలోల యూరియా వేయాలి. ఎకరాకు 3–5 కిలోల విత్తనాలు అవసరం. 7–10 రోజుల వ్యవధిలో 4–6 తడులు సాగునీరు ఇవ్వాలి. 40–50 రోజుల వ్యవధిలో మొదటి కోతకు వస్తుంది. ఎకరాకు 8–12 టన్నుల దిగుబడి వస్తుంది.

బర్సీం : మర్దాన్, మెస్కతి అధిక దిగుబడిని ఇచ్చే రకాలు. ఎకరాకు 10–15 కిలోల విత్తనం అవసరం. ఎకరాకు 8 కిలోల నత్రజని(రెండు దఫాలుగా), 15 కిలోల పోటాష్ వేయాలి. విత్తిన 50 రోజులకు మొదటి కోత నిస్తుంది. తదుపరి కోతల 30 రోజుల వ్యవధిలో తీసుకోవచ్చు. ప్రతి కోతకు 6–8 టన్నుల పచ్చిగ్రాసం వస్తుంది.

అలసంద

ఏకవార్షిక పప్పుజాతి గ్రాసాల్లో అలసంద ముఖ్యమైంది. ఇసీ- 4216, యూనీసీ 5286, 5287, రష్యన్‌జైంట్, అలసంద 2201, ఎన్పీ–3 తదితర రకాలు అధిక దిగుబడిని ఇస్తాయి. ఎకరాకు 15–20 కిలోల విత్తనం అవసరం. ఎకరాకు 7 కిలోల నత్రజని, 20 కిలోల పోటాష్ వేయాలి. 12–15 రోజుల కొకసారి నీటి తడి ఇవ్వాలి. ఎకరాకు 8–10 టన్నుల పచ్చిగ్రాసం దిగుబడి పొందవచ్చు.

పిల్లిపెసర

పిల్లిపెసర గ్రాసం అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే విత్తుకోవచ్చు. ఎకరాకు 10–15 టన్నుల విత్తనం సరిపోతుంది. వరిపైరు కోయడానికి రెండు, మూడు రోజుల ముందు పిల్లిపెసర విత్తనాలు వెదజల్లి పెంచవచ్చు. 45 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 10–12 టన్నుల పచ్చిమేత వస్తుంది.

జనుము : వరి కోయడానికి 3, 4 రోజుల ముందు విత్తనాలు పొలంలో వెదజల్లితే వరి కోసే సమయానికి మొలకెత్తుతుంది. ఎకరాకు 20 కిలోల విత్తనం కావాలి. 50–60 రోజులకు కోతకు వస్తుంది. పూత మీద ఉన్నప్పుడు కోసి ఐదు, ఆరు రోజులు ఎండ నిచ్చి కట్టలు కట్టి వరిగడ్డి వాముల్లో పొరలుగా వేయాలి. ఎకరాకు 8–10 టన్నుల దిగుబడి వస్తుంది.

అంజన్ గడ్డి : బంజరు భూములకు అనువైన అంజన్ గడ్డి. ఈజీఎఫ్ఆర్ఈ 3108, పీఏజెడ్ఆర్ఐ 75,76 రకాలు సాగుకు అనువైనవి. ఎకరాకు 3–4 కిలోల విత్తనం అవసరం. నారుపోసి పెంచి నాటితే ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాధారంగా సాగు చేయవచ్చు. దుక్కిలో ఎకరాకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు 12–15–12 కిలోలు వేయాలి. తదుపరి 12 కిలోల నత్రజని ప్రతి కోత తర్వాత వేయాలి. మొదటి కోత 90 రోజులకు, తదుపరి కోతలు 45 రోజుల వ్యవధితో తీసుకోవచ్చు. ఎకరాకు 10–12 టన్నుల పచ్చిమేత లభిస్తుంది. నీటి లభ్యతను మేరకు 8–10 కోతలు ఏడాదిలో తీసుకోవచ్చు.

కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి గెలుపు

డోన్ : డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై గెలుపొందారు. 6449 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన కోట్లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.



ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకుంటున్న టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బీసీ జనార్ధనరెడ్డి విజయం



ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకుంటున్న టీడీపీ అభ్యర్థి బీసీ జనార్థన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: ఉత్కంఠగా సాగిన సాధారణ ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధనరెడ్డి విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డిపై 24,769 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొదటి రెండు రౌండ్లు వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చినా మిగిలిన రౌండ్లలో బీసీ ఆధిపత్యం సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ప్రజలకు కుల,మతాలు,పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు అందాయి. కాటసాని రామిరెడ్డి అన్ని విధాలా బనగానపల్లె అభివృద్ధి బాటలో నడిపించారు. అయినా ప్రజలు టీడీపీపైపు మొగ్గ చూపడం అందరిని విస్మయం కలిగిస్తుంది.



నిత్యం రద్దీగా ఉండే పెట్రోల్‌బంకు కూడలి ఖాళీగా ఉన్న దృశ్యం



ఖాళీగా దర్శనమిస్తున్న గాంధీ సర్కిల్

నిర్మానుష్యం

బనగానపల్లె : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రం నంద్యాల సమీపంలోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన నేపథ్యంలో బనగానపల్లె పట్టణం నిర్మానుష్యంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు పరచడంతో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. పోలింగ్ అయిపోయినప్పటి నుంచి పోలీసులు పకడ్బందీగా వ్యవహరించడంతో దుకాణాలు, టీస్టాల్స్ ఇతర వ్యాపార సంస్థలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేశారు. కఠిన ఆంక్షలు విధించడంతో పట్టణంలోని ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు, వాహనల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే పెట్రోల్‌బంకు కూడలి బోసిపోయింది. బేతంచర్ల రోడ్డు, నంద్యాల రోడ్డు మార్కెట్ రోడ్డు వెలవెలబోయింది. ట్రాఫిక్ తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు సైతం బస్సుల సంఖ్యను కుదించారు. బస్టాండ్‌లో బస్సులు, ప్రయాణికులు లేకపోవడంతో ఖాళీగా దర్శినమిచ్చింది. వెలవెలబోయింది.



బస్సులేని ఆర్టీసీ బస్టాండ్

వెలవెలబోయిన డోన్ పట్టణం

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం డోన్ పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛంధంగా దుకాణాలు మూసివేసి ప్రశాంత వాతావరణానికి సహకరించారు. ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్,30 పోలీసు యాక్ట్‌ను పోలీసులు పకడ్బందీగా అమలు చేయడంతో పట్టణంలో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రత్యేక పోలీసు ఫికెటింగ్, రెండు మొబైల్ పార్టీలు, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు సీఐ, ఎస్ఐ పెట్రోలింగ్ నిర్వహించారు. దీంతో డోన్ పట్టణం వెలవెలబోయింది. అయితే కౌంటింగ్ అనంతరం ఏలాంటి విజయోత్సవ సంబరాలు చేసుకోకూడదన్న పోలీసు నిబంధనను టీడీపీ వర్గాలు విస్మరించాయి. పట్టణంలో పలుచోట్ల బాణా సంచా కాలుస్తూ టీడీపీ నాయకులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

పశువైద్య భవనం ఏర్పాటు చేయండి

నంద్యాల(అర్బన్) : పశుసంపదకు నిలయమైన నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో నూతన పశువైద్య భవనాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పాడుబడిన భవనంలో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో వైద్యసేవలకు అక్కడికి వెళ్లాలంటే పశుపోషకులు భయాందోళన చెందుతున్నారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో సిబ్బంది అభద్రతాభావంతో విధులు నిర్వహిస్తున్నారు. ఇక అక్కడ పశువుల వైద్యానికి కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలతో కూడిన నూతన భవనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుర్రపు డెక్క



క్రిష్టిపాడులో బ్రిడ్జికి అడ్డుగా నిలిచిన గుర్రపుడెక్క

దొర్నిపాడు: భారీ వర్షాల కారణంగా కుందూకు ఉధృతంగా వర్షపు నీరు చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపు డెక్క భారీగా కొట్టుకొస్తోంది. గుర్రపు డెక్క క్రిష్టిపాడు వద్దనున్న వంతెన వద్ద నిలిచి ప్రవాహానికి అడ్డంగా మారింది. ప్రస్తుతం నదిలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుర్రపు డెక్కను తొలగించకపోతే బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశముందని స్థానకులు పేర్కొంటున్నారు.



బోసిపోయిన బేతంచర్ల రోడ్డు



పాత బస్టాండ్ నుండి కోర్టు రోడ్‌లో మూసివేసిన దుకాణాలు

నేడు శివాలయంలో కలశాభిషేకం

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరులో వెలసిన రామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు భాస్కరయ్య తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు 108 కలశాలతో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహింస్తామన్నారు. వరుణుడు కరుణించాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ స్వామివారికి కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



రైల్వే గేటు పడినప్పుడు వేచి ఉన్న ద్విచక్రవాహణదారులు (ఫైల్)

తప్పని ఇబ్బందులు

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు సమస్య తీరడంలేదు. గేట్లపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు ఏళ్లతరబడి కోరుతున్న నెరవేరడం లేదు. రైళ్లు, గూడ్స్ వెళ్లేప్పుడు వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారిలో రైల్ గేటు ఉండంతో నిత్యం వాహనాలు నిలిచిపోతూనే ఉంటాయి. ఈ రైలుగేటు మీదుగా కర్నూలు, బనగానపల్లె, కోవెలకుంట్ల ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాలు వెళ్తుంటాయి. రైలు వెళ్లేప్పుడు గేటుపడిందటే వేచిచూడాల్సిందే. దీంతో గేటు అటు, ఇటు వైపు వాహనాలు బారులు తీరుతుంటాయి. గేటు ఎత్తారంటే వాహనచోదకులు వెళ్లేందుకు పోటీ పడుతుంటారు. ఒక్కసారిగా వాహనాలు ఎదురుపడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అప్పుడప్పుడు గొడవలు జరిగిన సందర్భాలు లేకపోలేదు.



రైల్వే ట్రాక్‌పైకి ఇరువైపులా ఒకేసారి వచ్చిన ద్విచక్రవాహనదారులు(ఫైల్)

‘సేంద్రియ’ సాగు లాభదాయకం

- భూసారం పెరిగేందుకు దోహదం
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

సంజామల: వ్యవసాయరంగాలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రసాయన ఎరువులు మితిమించి వాడుతున్న నేపథ్యంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భూసారం సైతం క్షీణిస్తుండడంతో వ్యవసాయ అధికారుల సూచనలు ఇప్పుడిప్పుడే సత్ఫలితాలిస్తున్నాయి. కొందరు రైతులు సేంద్రియ ఎరువుల సాగుకు మొగ్గు చూపుతున్నారు. రసాయన ఎరువులు మితిమీరి వాడడం వలన నేల భూసారం, నేలలో పోషకాలు తగ్గుతున్నాయి. అదేవిధంగా పంట దిగుబడి తక్కువగా రావడం, పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సేంద్రియ ఎరువుల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. భూసారం పెంపుపై దృష్టిసారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించడంపై రైతాంగం దృష్టి సారిస్తుంది.



పొలంలో పేడకోసం జీవాలను ఉంచుకున్న దృశ్యం

సేంద్రియ ఎరువులో పోషకాలు అధికం

సేంద్రియ ఎరువులో భూసారానికి కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. దీంతో పంట దిగుబడులు పెరుగుతాయి. బర్రెలు, ఎద్దులు, ఆవులు పేడను పొలంలో వేయండం ద్వారా భూసారం పేరుగుతుంది. పశువులపేడ పొలాలో చల్లుకోవడం, జీవాలను పొలంలో యాగించడం చేస్తున్నారు రైతులు. మరికొందరు రైతులు పశువుల శాలనుంచి, ఇతర నుంచి పేడను కోనుగోలు చేసి పొలంలో చల్లుతున్నారు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని–3% ,భాస్వరం .2%, పొటాషియం 1%, జింక్, మెగ్నీషియం, సేంద్రీయ కర్బనం, బోరన్ వంటి సూక్ష్మపోషక విలువలు లభిస్తాయి. సాధరణంగా వేసవిలో రైతులు పశువుల పేడను పోలాలకు తరలిస్తుంటారు. ఎండలు ఎక్కువగా ఉండడం వలన ఎరువుల పోషకాలు ఆవిరి అవుతాయి. కాబట్టి పేడను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తేమ మేరకు దున్నుకోవాలి. దీనివలన భూమిలో భూసారం పెరుగుతుంది.



పశువులశాల పేడను పొలానికి తరలిస్తున్న దృశ్యం

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి



సేంద్రీయ ఎరువుల వాడడం వలన మెక్కకు రోగనిరోదక శక్తి పెరుగుతుంది. చీడ పురుగులు, తెగుళ్ల నుంచి పైరుకు రక్షణ ఉంటుంది. తెగుళ్ల సోకకుంటే దిగుబడులు అధికంగా వస్తాయి. రైతులు ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. రసాయన ఎరువుల వాడడం వలన భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపడం సంతోషకరం.

– సుధాకర్ రెడ్డి,
సంజామల మండల వ్యవసాయ అధికారి